క్లుప్తంగా

నేడు వై.రామవరంలో ఎమ్మెల్యే పర్యటన

వై.రామవరం: మండల కేంద్రంలోని శనివారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి తెలిపారు. వారు మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించే గ్రామ వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం వై.రామవరంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండల ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ ఇన్‌చార్జిలు తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు.

29న లోతుగెడ్డలో 'గడప గడపకు'

చింతపల్లిరూరల్: మండలంలోని లోతుగెడ్డ పంచాయతీల్లోని పలు గ్రామాల్లో సోమవారం గడప–గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి తెలిపారు.పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరవుతారని, నాయకులు, ప్రజా ప్రతినిధులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

29న వలంటీర్లకు సన్మానం

కొయ్యూరు: మండల పరిషత్ కార్యాలయంలో 29న వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మేరీరోజ్ శుక్రవారం తెలిపారు. వలంటీర్లలో ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, మిగిలిన వారికి సేవ మిత్ర అందజేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వస్తారని తెలిపారు.

30న మండల సమావేశం

కొయ్యూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 30 నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మేరీ రోజ్ శుక్రవారం తెలిపారు. మంగళవారం ఉదయం పది గంటలకు ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన ప్రారంభిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు విధిగా రికార్డులతో హాజరు కావాలని కోరారు. ప్రజాప్రతినిధులు అందరికి సమాచారం తెలియజేసినట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ఆటలో నిమగ్నమైన విద్యార్థులు

డుంబ్రిగుడ: మండలంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం తాడు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి శెట్టి సునీత మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెం పంచాయతీ, బోర్నగూడెం గ్రామానికి ప్రభుత్వం రూ.17లక్షల అంచనా వ్యయంతో రక్షిత తాగునీటి పథకం మంజూరు చేయగా శుక్రవారం పనులకు భూమి పూజ జరిగింది. 20 లీటర్ల సామర్థ్యం గల వాటర్‌ట్యాంక్ నిర్మిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటి చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు, ఎంపీపీ గోము వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు బేతపూడిలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. వీరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ధర్మకర్త పాము ధర్మారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం భజనా కార్యక్రమాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మి, చల్లా నాయుడు, కె.ఎస్ అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు చల్లా తాతయ్యలు, ఎం. ఈశ్వరమ్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



చెరువుపాకలలో గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



జగ్గంపాలెంలో గిరిజనులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

ముంచంగిపుట్టు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో గల కిలగాడ పంచాయితీ చెరువుపాకల, మల్కరిపుట్టు, రాయిపల్లి గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గుణకు గ్రామాల్లో గిరిజనులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 179 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాలనలో ప్రజలు సంక్షేమ బాటలో పయనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తోందన్నారు. జగనన్న మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తున్నారన్నారు.గ్రామాల్లో సీసీ రోడ్డు వేయాలని గ్రామాల గిరిజనులు ఎమ్మెల్యేను కోరారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్‌లు శివశంకర్, రమేష్, ఎంపీడీవో రమేష్, మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, నేతలు జగబంధు, జయదేవ్, చంటిబాబు, సన్యాసిరావు, జగన్నాథం, కొండలరావు, తిరుపతిరావుతో పాటు సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నదే

గంగవరం : ప్రజలకు ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం గంగవరం మండలం జగ్గంపాలెం సచివాలయం పరిధిలో జగ్గంపాలెం, ఓజుబంద గ్రామాల్లోమ నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రాత్రి 9 గంటల ఆయా గ్రామాల్లో పర్యటించి 285 గడపలను సందర్శించారు. ఆమెకు గిరిజన మహిళలు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ పథకాల అమలుపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వ పరిపాలన విధానాలపై ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓజుబంద గ్రామంలో మంచినీటి సమస్య ఉందని, వీధి లైట్లు, రోడ్లు నిర్మించాలని కోరగా, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో మౌలి క సౌకర్యాలు కల్పనకు గడప గడపకు మన ప్రభుత్వ నిధులను మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , జెడ్పీటీసీ బేబిరత్నం, వైస్ ఎంపీపీలు కె.రామతులసి, కుంజం గంగాదేవి, ఎంపీటీసీ సభ్యులు కుంజం పద్మావతి, పి.కనకలక్ష్మి, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థదొర, సర్పంచ్‌లు తుర్రం లీలావతి, శారపు కామరాజుదొర, రమణమ్మ, వెంకటేశ్వర్లుదొర, కుంజం సత్యవతి, ఆర్‌ఐ ఫయాజ్ బాషా, వీఆర్వో సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ కుంజం శ్రీనివాసు, నాయకులు సత్యవతి, రాధాకృష్ణ, రామారావు, రాంబాబు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



అరకులోయలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉషారాణి తదితరులు



హుకుంపేటలో విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద 80 మంది రైతులకు 30 క్వింటాళ్ల వరి విత్తనాలను ఎంపీపీ ఉషారాణి, ప్రజాప్రతినిధులు శుక్రవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందన్నారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, సర్పంచ్ దాసుబాబు, వైస్ సర్పంచ్ శెట్టి విజయనిర్మల, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, నాయకులు చందుపాడి, నర్సింగ్, రామ్మూర్తి, అధికారులు ఏఈవో దొర, శశికళ పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని దాలిగుమ్మడి రైతు భరోసా కేంద్రంలో ఏవో బి.సరోజిని ఆధ్వర్యంలో రైతులకు ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం శుక్రవారం విత్తనాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతీ రైతుకు మేలు జరుగుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, నాయకులు అనిల్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు



సమస్యలపై చర్చిస్తున్న ఎంపీపీ ఉషారాణి, డిప్యూటీ తహసీల్దార్ దొన్ను

అరకులోయ రూరల్: అర్హులందరికీ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి చెప్పారు. ఈ మేరకు వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, ప్రజాప్రతినిధులతో శుక్రవారం డిప్యూటి తహసీల్దార్ దొన్నుతో సమావేశమయ్యారు. మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పక్రియ వేగవంతం చేయాలని వారు కోరారు. ఇప్పటికే పోడు వ్యవసాయ రైతులు 300 మంది దరఖాస్తులు చేశారని, మిగిలిన రైతులు కూడా వీఆర్వోల వద్ద దరఖాస్తులు చేసుకోవచ్చని డీటీ దొన్ను వివరించారు. దరఖాస్తులు ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆదేశాలు వచ్చిన వెంటనే పట్టాలు పంపిణీ చేస్తామన్నారు, అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, నాయకులు నర్సింగ్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



గిరి దుర్గాభవాని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అడ్డతీగల: మండల కేంద్రంలోని పవనగిరి క్షేత్రంలో కొలువైన గిరి దుర్గాభవాని ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. అయ్యప్పశర్మ పౌరోహిత్యంలో అమ్మవారికి ఖడ్గమాలతో కుంకుమ పూజ చేశారు. అలాగే మానసాదేవికి శ్రీ సూక్తంతో కుంకుమ పూజ జరిపారు. హోమం నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని తలంచి పూజాధికాలు నిర్వహించినట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు.భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

భక్తులకు గంగాలమ్మ పుట్టింటి చీర, సారె వితరణ

వై.రామవరం మండలం ఎల్లాపురం, పెనికెలపాడు గ్రామాలకు పవనగిరి క్షేత్రం ద్వారా గంగాలమ్మకు పుట్టింటి చీర, సారె వితరణగా ఇచ్చినట్టు తణుకు వెంకటరామయ్య తెలిపారు. పూజాసామగ్రి, అమ్మవారి ఘటం కూడా అందజేశామన్నారు.

రాకపోకలు పునరుద్ధరణ



డైవర్షన్ రహదారి

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి శివారున గల ఇరుకు వంతెన వద్ద డైవర్షన్ రహదారి నిర్మాణం చేపట్టి వాహనాల రాకపోకలను శుక్రవారం ఉదయానికి పునరుద్దరించారు. ఈ ప్రాంతంలో ఎన్‌హెచ్ 516ఈ పనులు చేపడుతున్న అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ డైవర్షన్‌ను పూర్తి చేశారు. జడ్డంగి వద్ద ఇరుకు వంతెన పాక్షికంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారడంతో ఆర్టీసీ బస్సులు సహితం ఈ రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు నిలచిపోయిన సంగతి తెలిసిందే. కాగా వంతెనకు కొంత దూరం నుంచి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు జరగడంతో ఇబ్బందులు తొలగాయి. ఆర్టీసీ బస్‌లు కూడా తిరుగుతున్నాయి.

రోడ్డు పూర్తి చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ రూరల్: మండలంలో మాదల పంచాయితీ దాబుగుడ తారురోడ్డు పనులు పూర్తి చేయాలని గిరిజన సంఘం నాయకులు మండల పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ శేషగిరికు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు రామన్న, రమేష్‌లు మాట్లాడుతూ మజ్జివలస జంక్షన్ నుంచి దాబుగుడ వరకు 2014లో నాలుగు కిలోమీటర్లు తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం వాహనాలు తిరగలేని పరిస్థితి ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని వారు కోరారు,. నాయకులు బుజ్జిబాబు, గెన్ను పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో సౌకర్యాలు కల్పించాలి



సౌకర్యాలు కల్పించాలని నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు, ఉపాధి వేతనదారులు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ వలజంగి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు. నేతలు శుక్రవారం పరిశీలించారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకపోవడంపై వారు మండిపడ్డారు. ఉపాధి కూలీలతో కలిసి సౌకర్యాలు కల్పించాలంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియూ మండల కార్యదర్శి కె.శంకర్‌రావు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, మజ్జిగ ప్యాకెట్లు, తాగునీట సదుపాయం కల్పించాలని, పనిముట్లు అందించాలని ఆయన కోరారు. నేతలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

చకచకా పనులు

- గోస్తనీనదిపై శరవేగంగా బ్రిడ్జి నిర్మాణాలు
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో వంతెనలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



గోస్తనీ నదిపై శరవేగంగా జరుగుతున్న జీలుగులపాడు వంతెన నిర్మాణ పనులు



శరవేగంగా జరుగుతున్న సారవానిపాలెం వంతెన నిర్మాణ పనులు

అనంతగిరి: వర్షాకాలం అయితే ఆయా గ్రామాలకు చేరుకునేందుకు నానా అవస్థలు తప్పవు. గోస్తనీ నదిని దాటాలంటే ప్రాణాలతో చెలగాటం ఆడాల్సిందే. గోస్తనీ నది ప్రవాహం అధికంగా ఉంటే ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించి, స్థానికులు ఇళ్లకే పరిమితమయ్యేవారు. అత్యవసర పరిస్థితిల్లో ప్రాణాలను పణంగా పెట్టి దాటేవారు. ఇలాంటి ఘటనలు పలువురు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. అనంతగిరి మంలంలోని గోస్తనీపై జీలుగులపాడు, సారవానిపాలెం ప్రాంతాల్లో వంతెనలు లేక స్థానికుల ఇబ్బందులు వర్ణనాతీతం. గత టీడీపీ హయాంలో ఆయా ప్రాంతాల్లో వంతెనలు నిర్మించాలని పలుమార్లు పాలకులు, అధికారులకు గ్రామస్తులు వినతులు అందజేసినా ఫలితం లేకుండా పోయింది. అదంతా గతం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అనంతగిరి మండలంలోని జీలుగులపాడు, సారవానిపాలెం వంతెనల కోసం అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా ఎస్‌సీపీ గ్రాంటులో రెండు వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరుచేయడంతో ప్రస్తుతం గోస్తనీ నదిపై పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో ఆయా గ్రామస్తులకు కలగా ఉన్న వంతెనలు అందుబాటులో రానుండడంతో స్థానికులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే పాల్గుణకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నిధులు మంజూరు

సారవానిపాలెంలో రూ.2 కోట్లు, జీలుగులపాడులో రూ2.2 కోట్లతో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సారవానిపాలెం వంతెన నిర్మాణం పూర్తయ్యితే సుమారు 10 గ్రామాల గిరిజనులకు మేలు జరుగుతుంది. జీలుగుడులపాడు వంతెన పూర్తయ్యితే విజయనగరం జిల్లా, అల్లూరి జిల్లాలకు చెందిన 30 గ్రామాలకు మేలు జరుగుతుంది.

త్వరితగతిన పనులు పూర్తి

గోస్తనీ నదిపై సారవానిపాలెం, జీలుగులపాడు రెండు వంతెనల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసి వంతెన అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. వంతెనలు పూర్తయితే పలు గ్రామాలకు మేలు జరుగుతుంది.

– గణేష్, ఏఈ, ట్రైబల్ వెల్ఫేర్, అనంతగిరి

రేషన్ బియ్యం పంపిణీ



తూరుబొంగులలో గిరిజనులకు బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

చింతపల్లి: చింతపల్లి మండలం కుడుముసారి పంచాయతీలోని కుడుముసారి, తూరుబొంగుల గ్రామాల్లో గిరిజనులకు శుక్రవారం ఎండీయూ వాహనాల ద్వారా నిత్యవసరాలు, రేషన్ బియ్యం పంపిణీ చేపట్టారు. ఆయా గ్రామాల్లో పలు కుటుంబాలకు రెండు నెలలుగా ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ జరగలేదంటూ గిరిజనులు గిరిజన సంఘం నాయకులతో కలసి బుధవారం చింతపల్లి తహసీల్దార్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన విచారణ జరిపారు. జీసీసీ అధికారులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎండీయూ వాహనదారులతో మాట్లాడి తక్షణమే ఆయా గ్రామాల్లో బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం రెండు గ్రామాల్లోనూ గిరిజనులకు బియ్యం పంపిణీ జరిగింది.

సమావేశంలో వెల్లువెత్తిన సమస్యలు



మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మారేడుమిల్లి: మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సొర్ల లలిత కుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే మండల సమావేశాలకు ఆర్‌డబ్ల్యూఎస్, విద్యాశాఖ, ఫారెస్ట్, హార్టికల్చర్‌తో పాటు పలు శాఖల అధికారులు తరుచూ డుమ్మా కొడుతున్నారని అలాంటప్పుడు ఈ సమావేశాలు నిర్వహించడం ఎందుకని వారు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని, వాటి వల్ల పంటలు నాశనం అవుతున్నాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. జంగిల్ క్లియరెన్స్ లేక చాలా రహదారుల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని, జీఎంవలస గ్రామానికి నిత్యం బస్సు సర్వీసు నడపాలని, అలాగే స్థానిక కొత్తకాలనిలో ఎటువంటి కారణం లేకుండా పలు గృహాలకు విద్యుత్ సరఫరా నిలపివేశారని దీనిపై ఆయా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, నిత్యం సాయంత్రం నర్సీపట్నం నుంచి మారేడుమిల్లి వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసు గ్రామ శివారులోనే నిలివేస్తుడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బస్సు గ్రామంలోకి వచ్చేల చర్యలు తీసుకోవాలని పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లలిత కుమారి కోరారు. ఎంపీడీవో బి.అశోక్ కుమార్, ఎమ్మార్వో శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, సర్పంచ్ కొండ జాకబ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు

కె.కోటపాడు: ఖరీఫ్ సాగుకు ముందు రైతులు పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులను వేయాలని ఏవో పి.సోమశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పచ్చిరొట్ట ఎరువుల్లో భాగంగా 50 శాతం రాయితీపై జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సాగు కాలంలో మండల రైతులు వరినాట్లు జూలై రెండో వారం నుంచి నాల్గో వారం వరకూ వేయనున్నట్లు తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి పోలీసు శాఖ కృషి



వై రేగడిపాలెంలో జనమైత్రి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీఐ రాంబాబు

వై.రామవరం: పోలీసులు ప్రజలు సత్సంబంధాలు కలిగి ఉండాలని అడ్డతీగల సిఐ వై రాంబాబు అన్నారు. వై.రామవరం మండలం రేగడిపాలెం గ్రామంలో శుక్రవారం సిఐ రాంబాబు ఆధ్వర్యంలో జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు జనమైత్రి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం పోలీసు శాఖ విశేష కృషి చేస్తోందన్నారు. గిరిజనులు గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని, సారా తయారీ, విక్రయాలు చేయవద్దన్నారు. యువత వ్యసనాల జోలికి పోవద్దని హితవుపలికారు. ఉన్నత విద్య, క్రీడలపై దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై గ్రామ యువతకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, సక్రమమైన వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. మోసపూరిత ఆన్‌లైన్ యాప్‌లను, లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలరు. విద్యుత్ తీగలతో జంతువులు వేట వలన సంభవించే దుష్ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని తమ దృష్టికి తీసుకొస్తే పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామ సమస్యలను తమకు తెలియజేస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. మూఢ నమ్మకాలతో ఆరోగ్యాన్ని ప్రాణాపాయస్థితికి తెచ్చుకోవద్దన్నారు. ఏదైనా అనారోగ్యానికి గురైతే వెంటనే సమీప ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల ద్వారా చికిత్స పొందాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జీసీసీ హమాలీల సమ్మె విరమణ

జి.మాడుగుల: జీసీసీ హమాలీ కార్మికులు ఎట్టకేలకు సమ్మెను విరమించారు. పాడేరు, రంపచోడవరం డివిజన్లలో పనిచేస్తున్న హమాలీలు గత మూడు రోజులుగా మండల స్టాక్ పాయింట్ల వద్ద తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. సమస్యల పరిష్కారంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇవ్వడంతో సమ్మెను విరమిస్తున్నట్టు ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి పండుబాబు తెలిపారు. జీసీసీ హమాలీలంతా శనివారం నుంచి విధులకు హాజరుకావాలని ఆయన కోరారు. బాబూరావు, సత్తిబాబు, శ్రీనుబాబు, సురేష్, మోహన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార దుకాణాలు తొలగించాలి

హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని ఆనుకొని అనధికారికంగా నిర్మించిన దుకాణాలు తొలగించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి.కృష్ణారావు అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రోజురోజుకు మండల కేంద్రంలో ట్రాఫిక్ పెరుగుతుందని, అక్రమ దుకాణాల వల్ల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు స్పందించి దుకాణాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.